నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం



అల్వాల్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని, నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ అన్నారు. గురువారం సీసీకెమెరాల ఆవశ్యకతపై వినాయక్‌నగర్‌లోని పలు రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన వారితో ఆయన సమావేశం నిర్వహించారు. కాలనీలో శాంతి భద్రతలను కాపాడి, ప్రశాంత వాతావరణం కల్పించడానికి సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి దిశానిర్దేశం చేశారు. ఎస్సై శ్రీనివాస్‌రావు, పలువురు నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాలనీవాసులతో ఆత్మీయ సమావేశం



షిరిడీనగర్ కాలనీవాసులతో కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: షిరిడీనగర్ కాలనీవాసులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ ఏర్పడిన నాటి నుంచి దశలవారీగా అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఆటోమెటిడ్ లైట్ల ఏర్పాటు తదితర పనులు పూర్తిచేశానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాలనీలో రోడ్లు, మౌలికవసతుల కల్పనకు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రిజ్వాన్‌ఖాన్, కార్యదర్శులు సత్తిరెడ్డి, సత్యం, కాంగ్రెస్ నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఆట పరికరాలు



అల్వాల్: దొడ్డి అల్వాల్‌లోని సుభాష్‌నగర్ ప్రభుత్వ స్కూల్‌లో వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్ ఆధ్వర్యంలో పాఠశాలకు ఆటపరికరాలను అందజేశారు. ఉపాధ్యాయులు, బీఆర్‌ఎస్ నేతలు శంకర్, శ్రీనివాస్, ప్రభాకర్, మోసిన్, రాజు, జనార్దన్, అనిల్, అముల్ తదితరులున్నారు.

కమ్యూనిటీహాల్ స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

మౌలాలి: ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీహాల్ కమ్యూనిటీ స్థలాన్ని పరిరక్షించాలని కాలనీవాసులు హైడ్రా అధికారులను కోరారు. ప్రశాంత్ నగర్ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు గురువారం హైడ్రా అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సర్వే నెంబర్ 360లోని 12 గుంటల స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. కాలనీవాసులు బుచ్చిరెడ్డి, పర్వతాలుయాదవ్, ప్రవీణ్, జితేందర్, అశోక్‌గౌడ్, విష్ణుమూర్తి తదితరులున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: నియోజకవర్గానికి చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు మంజూరయ్యాయి. గురువారం లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ నేతలు నెమలి అనిల్‌కుమార్, అంజయ్య, సాయికిరణ్‌గౌడ్, బాలరాజు, అల్లూరయ్య, లూకాస్, శ్రీకాంత్‌రెడ్డి, రాజేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మారని రూపు రేఖలు !

గ్రామపంచాయతీ నుంచి కార్పొరేషన్‌గా మారిన జవహర్‌నగర్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. జిల్లాలో అత్యధిక జనాభా కలిగినా.. అభివృద్ధి మాత్రం కలగానే మిగిలిపోతోంది.

హోదా పెరిగినా.. ఊసేలేని అభివృద్ధి
- ఇరుకు రోడ్లు, మురుగుతో దుర్వాసన
- బురదమయమైన రోడ్లు, ఇబ్బంది పడుతున్న ప్రజలు



జవహర్‌నగర్‌లో అస్తవ్యస్తంగా ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థ

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం రెండు లక్షలకు పైగా జనాభా ఉండగా అదనంగా మరో 50 వేలమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్నారు.

◆ నగరంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసుకుంటూ.. ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఇక్కడే డంపింగ్‌యార్డు ఉండటంతో రద్దీ మరింత ఎక్కువైంది. ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు, చెత్త లారీలు, టిప్పర్లతో ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది.

◆ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ఇటీవల కోట్లాది రూపాయలు మంజూరు చేసి, అంబేడ్కర్‌నగర్ నుంచి బాలాజీనగర్ వరకు 100 ఫీట్ల రోడ్డు పనులను ప్రారంభించారు. బాలాజీనగర్ నుంచి యాప్రాల్ ప్రధాన రహదారి పనులు చేయాల్సి ఉంది. ఆ నిధులతోనే రోడ్డును విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డును విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

వెలగని లైట్లు...

పట్టణంలో ప్రధాన రహదారి వెంట ఉన్న లైట్లు వెలకగకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణంలో 8,500 విద్యుత్ స్తంభాలు ఉండగా.. వాటిలో దాదాపు 2 వేల స్తంభాలకు లైట్లు లేవు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు...

28 డివిజన్లలో చాలా కాలనీల్లో రోడ్లు ధ్వంసమై గుంతలమయంగా మారాయి. చిన్నపాటి జల్లులకే బురదమయంగా మారుతున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి తాగునీటి ట్యాంకులు నిర్మించినప్పటికీ ప్రజల దప్పికమాత్రం తీరడంలేదు.

పట్టించుకునే వారే కరువు



శివాజీనగర్‌లో చాలా కాలనీలలో అసంపూర్తిగా రోడ్లు, డ్రైనేజీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వర్షం పడితే నరకం కనబడుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని అభివృద్ధిపై దృష్టి సారించాలి.

– రవీందర్, శివాజీనగర్

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం



ప్రస్తుతం 100 రోజుల యాక్షన్‌ప్లాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. అన్ని కాలనీల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. ఇంకా చేపట్టాల్సిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం.

– వసంత, జవహర్‌నగర్ కమిషనర్

పేద పిల్లలకు 'ఫీడింగ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్'

కుషాయిగూడ: పేదపిల్లలకు చేయూతనివ్వాలనే సంకల్పంతోనే సంస్థను ఏర్పాటు చేసి పేదలకు తమవంతు సహకారం అందజేస్తున్నట్లు గో ఇండియా ట్రస్ట్ డైరెక్టర్ కిరణ్‌పాల్ అన్నారు. గో ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో చర్లపల్లి డివిజన్, విద్యామారుతీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన పేద పిల్లలకు 'ఫీడింగ్ అండ్ ఎడ్యుకేషన్' సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో పిల్లలకు వారి తల్లిదండ్రులకు ఆహారం, ట్యూషన్‌తో పాటు నైతిక విలువలను నేర్పుతున్నట్లు చెప్పారు. వాళ్లు స్వతహాగా జీవించేలా వారిని తీర్చిదిద్దాలన్నది.. 'గో ఇండియా' ప్రధాన ధ్యేయమన్నారు.



గో ఇండియా పనితీరును వివరిస్తున్న డైరెక్టర్ కిరణ్‌పాల్

వరికుప్పల మాథ్యూస్, కాలనీ ప్రెసిడెంట్ గురుసాయి తదితరులున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ.24 కోట్ల నిధులు మంజూరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది నుంచి నిధులు కోసం ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. నిధులు కేటాయించి టెండర్ ప్రక్రియలో ఉందన్నారు. ప్రధాన రహదారులను విస్తరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిధుల కేటాయింపునకు కృషి చేసినందుకు కాలనీవాసులు ఆయనను ఈ సందర్భంగా సత్కరించారు. మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



వజ్రేష్‌యాదవ్‌ను కలిసిన కాలనీవాసులు

సీసీరోడ్డు పనుల పరిశీలన

మల్లాపూర్: నాచారం డివిజన్ ఇందిరానగర్‌లోని మసీదు వీధి, చర్చి వీధుల్లో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరానగర్‌లోని అన్ని వీధుల్లో దాదాపు భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తి చేసి సిమెంట్ రోడ్డు కూడా వేశామన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆమె సూచించారు. బీఆర్‌ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, విఠల్‌యాదవ్, కట్ట బుచ్చన్నగౌడ్, చంద్రశేఖర్, గౌస్‌బాయ్, అమీర్, జాకీర్, జానీ, అహ్మద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

కాలనీ అభివృద్ధికి తగిన చర్యలు



స్పీడ్ బ్రేకర్లను తనిఖీ చేసిన అసోసియేషన్ సభ్యులు

మల్కాజిగిరి: ఆర్‌కేనగర్ కాలనీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్, రవికిరణ్‌లు తెలిపారు. కాలనీలో సుమారు రూ.2.25 లక్షలతో ఏర్పాటు చేసిన 28 స్పీడ్ బ్రేకర్లను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఆనంద్‌బాగ్‌లో ట్రాఫిక్ పోలీసుల తనిఖీల వలన పక్కనే ఉన్న కాలనీలో ఎక్కువ వాహనాలు తిరుగుతున్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ దృష్టికి తీసుకెళ్లామని, ఆ విభాగం అధికారులు తనిఖీలు చేసి ప్రమాదాల నివారణకు ఏఏ ప్రాంతాల్లో గుర్తించారో.. అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశామన్నారు. కాలనీల్లో పోకిరీల బెడదను అరికట్టడానికి పోలీస్ పెట్రోలింగ్ పెంచే చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్ట్రీట్ నెంబర్– 2లో పాన్‌షాపు, టీస్టాల్ ఏర్పాటు వలన ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని, కాలనీ ప్రజలు ఫిర్యాదు చేశారని జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, వీఎస్‌ఎస్ గుప్తా, సంయుక్త కార్యదర్శి సంజయ్, కోశాధికారి సాయినాథ్, సభ్యులు శ్యామ్, కృష్ణ, నయూమ్‌ఖాన్, ప్రమోద్‌రెడ్డి, సుందర్, శివకుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

బోనాలకు నిధులు మంజూరు చేయండి

హబ్సిగూడ: బోనాల పండుగకు గతంలో కంటే ఎక్కువ నిధులు మంజూరు చేయాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వేంకటేశ్వర్‌రెడ్డి మంత్రి కొండా సురేఖను కోరారు. గురువారం మంత్రిని కలిసి ఉప్పల్ ప్రాంతంలో నిర్వహించే బోనాల ఉత్సవాలపై చర్చించి నిధులు విడుదల చేయాలని, లేదంటే ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో లోటు ఉంటుందన్నారు. గడ్డం రవికుమార్, గిరిబాబు, రామంతాపూర్ ఇన్‌చార్జి మురళీగౌడ్, వినోద్‌ముదిరాజ్, కృష్ణ, బిక్షపతి తదితరులున్నారు.



మంత్రి కొండా సురేఖతో కాంగ్రెస్ నాయకులు

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలి

అల్వాల్: రాష్ట్రంలో ప్రైవేట్ కళాశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని గద్దర్ అభిమానుల సంఘం, అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎల్. యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులచే లక్షల రూపాయలు దండుకుంటూ.. ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ కళాశాలలు, స్కూల్స్ పెద్ద మొత్తంలో విద్యను వ్యాపారంగా మార్చాయని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వ అధికారులు ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

దళారులను ఆశ్రయించొద్దు

అల్వాల్: మండల కార్యాలయం జారీ చేసే ధ్రువీకరణపత్రాల కోసం దళారులను ఆశ్రయించొద్దని అల్వాల్ మండల తహసీల్దార్ రాములు అన్నారు. విద్యా సంవత్సర ప్రారంభ సమయం కావడంతో చాలామంది కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దళారులను ఆశ్రయించి మోసపోతుంటారని వీరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, నిరీత గడువులోగా సర్టిఫికెట్లు మంజూరు చేయబడుతాయన్నారు.

పాలీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



రామంతాపూర్ : పాలీసెట్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 520 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సెలింగ్ ప్రక్రియ హెల్ప్‌డెస్క్ కో–ఆర్డినేటర్ ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 29 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని జూలై 1 వరకు అభ్యర్థులు ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చని తెలిపారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో అధికారులు మల్లికార్జున్ తదితరులున్నారు.

డెలివరీ బాయ్ ఆత్మహత్య



ప్రభుకుమార్ (ఫైల్)

మేడిపల్లి: డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్వతాపూర్ లక్ష్మీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న జార్జిగూడెం ప్రభుకుమార్ (26) స్థానికంగా ఉంటూ.. రాత్రివేళల్లో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. కాగా బుధవారం రాత్రి విధులు ముగించుకుని వచ్చిన అతడు తన గదికి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత సమస్యలను ఎదుర్కోలేకపోతున్నానని, తన కుటుంబసభ్యులు, స్నేహితులను మిస్ అవుతున్నానని సూసైడ్‌నోట్‌లో పేర్కొన్నాడు. కుటుంబసభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, నరసింహానగర్, షణ్ముఖ రెసిడెన్సీలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి గురువారం పరిశీలించారు. అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. అభివృద్ధి పనుల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దని సూచించారు. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, రంగు ప్రసాద్‌గౌడ్, నరసింహగౌడ్, రాకేష్, వేణు, వెంకటేష్, సంజయ్, రాజు, శ్యామ్, విజయ్, నిసార్ అహ్మద్‌గోరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌బీకాలనీలో యూజీడీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ అన్నపూర్ణ కాలనీలో రూ.68 లక్షలతో నిర్మిస్తున్న బాక్స్ డ్రైనేజీ పనులను గురువారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రెయిన్ పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. చుట్టు పక్కల ఇళ్ల వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, ఏఈ ప్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రామారావు, స్థానికులు వాసుగౌడ్, దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, కాలనీ అధ్యక్షులు భానుచందర్‌రెడ్డి, ప్రదీప్, సాహు, ముబీన్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కాప్రా: కాప్రా డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి పరిశీలించారు. గోపాల్‌రెడ్డినగర్‌లో రూ. 39 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులు, మాణిక్‌సాయి ఎన్‌క్లేవ్‌లో రూ.36 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం శ్రీసాయిఎన్‌క్లేవ్ కాలనీలో రూ. 83 లక్షలతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

ప్రారంభమైన వారాహి అమ్మవారి నవరాత్రులు



కుషాయిగూడ: ఆషాడమాసం ప్రారంభం గురువారం వారాహి అమ్మవారి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. హెచ్‌బీకాలనీ, తిరుమలనగర్‌లోని పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. 9 రోజుల పాటు అమ్మవారికి వివిధ అలంకరణల్లో పూజలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు వివరించారు. బ్రహ్మచారి, సమ్మని మురళీచారి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ రాజు

సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ చైర్మన్ రాజు

గౌతంనగర్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు చైర్మన్ రాజు అన్నారు. గురువారం గౌతంనగర్ డివిజన్ హనుమాన్‌పేట్ కమ్యూనిటీహాల్‌లో సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు ఖాతాదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. వినియోగదారుల నమ్మకంతోనే బ్యాంకుల మనుగడ సాధ్యమవుతుందన్నారు. 1997లో బ్యాంకు స్థాపించి 2024 నాటికి రూ.4 వేల కోట్ల వ్యాపారాన్ని అధిగమించి రూ.77.58 కోట్ల లాభాన్ని ఆర్జించినట్లు చెప్పారు. మేనేజింగ్ డైరెక్టర్ మన్నె నరేంద్రకుమార్, డైరెక్టర్ సోమలింగం గౌడ్, మేనేజర్ ఎస్‌ఎం.పీరాన్, ఖాతాదారులు ఏవీ. స్వామి, మహ్మద్ నూర్, శంకర్‌రావు పాల్గొన్నారు.

రూ.6 లక్షలతో డ్రైనేజీ పైపులైన్ పనులు

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్‌లోని వాసవీనగర్ వీధినెంబర్– 1లో సుమారు రూ.6 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ కక్కిరేని చేతనాహరీష్ గురువారం ప్రారంభించారు. పైపులైన్లకు బండరాళ్లు అడ్డంగా ఉండటంతో మురుగునీటి పరుదల సాఫీగా సాగడం లేదన్నారు. మురుగు సాఫీగా వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం వీధినెం.3లో పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. జలమండలి అధికారి ఏఈ రవీందర్, కిషన్, బీజేపీ నేతలు సంజయ్‌పటేల్, గడ్డం సాయికిరణ్, ఎల్లాచారి, సంగప్ప, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చేతనాహరీష్ తదితరులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాప్రా: విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపుతో శుక్రవారం సైనిక్‌పురి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లక్ష్మీపురి, బృందావన్‌కాలనీ, త్యాగరాయనగర్, నయాక్రాంతినగర్, ప్రశాంత్‌నగర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాణిక్‌సాయి, ఓయూటీ కాలనీ, మాధవపురి, భాస్కర్‌రావునగర్, క్లాసిక్ ఎన్‌క్లేవ్, లేక్‌వ్యూ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని, ఏఈ వివరించారు.

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు కాలనీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. మల్లయ్యనగర్, వాసవీనగర్, వీరారెడ్డినగర్, భవానీనగర్, గాయత్రిహిల్స్, తిరుమల మెడోస్, రెడ్డిస్‌కాలనీ, హేమానగర్, లక్ష్మీగణపతి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేడిపల్లి: 11కేవీ కాచవానిసింగారం ఫీడర్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ ప్రతాప్ సింగారం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంట్ నిలిపేయబడుతుందని ఏఈ సత్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11కేవీ ప్రతాప్‌సింగారం ఫీడర్ పరిదిలో మరమ్మతుల కారణంగా 33/11 కేవీ ప్రతాప్‌సింగారం సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్కాజిగిరి: వసంతపురి సబ్‌స్టేషన్ 11కేవీ రాఘవేంద్ర థియేటర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గోపాల్ తెలిపారు.